సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 26 । జనవరి । 2025



నువ్వా.. నేనా..!

పులివెందుల మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ప్రస్తుత ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గాలు 'నువ్వా, నేనా' అన్నట్లు తీవ్ర విభేదాలతో ప్రవర్తిస్తున్నాయి. -IIలో



సీకే నాయుడు క్రికెట్ టోర్నీ ప్రారంభం

కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో కల్నల్ సీకే నాయుడు అంతర్ రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.150	రూ.180
రెండోరకం	రూ.90	రూ.146

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 61 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



లోహితారెడ్డి

చిన్నమండెం: చిన్నమండెం మండలం ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని కె.లోహితారెడ్డి రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రమేష్ తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రథమస్థానం పొందినట్లు చెప్పారు. ఆదివారం విజయవాడలో ఎస్‌డీపీ చేతుల మీదుగా ప్రశంసాపత్రం, జ్ఞాపికను, నగదు బహుమతిని లోహితారెడ్డి అందుకోనున్నట్లు తెలిపారు.విద్యార్థినికి ప్రిన్సిపల్ రమేష్, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

మల్లయ్యకొండకు రూ.19.88 లక్షల ఆదాయం

తంబళ్లపల్లె: మహాశివరాత్రికి మల్లయ్యకొండపై జరిగే ఉత్సవాలకు సంబంధించి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, ఈఓలు మునిరాజ, రమణ ఆధ్వర్యంలో వేలం పాట జరిగింది. వాహనాల పార్కింగ్ నిర్వహణను పి.రెడ్డప్పరెడ్డి రూ.4,72,000 కు దక్కించుకున్నారు. తలనీలాల సేకరణ బాలకృష్ణ రూ.3,51,000కు పాడుకున్నారు. గౌరమ్మగుడి పూజా నిర్వహణ బావయ్య రూ.3,81,00కు, ఏనుగుమల్లమ్మగుడి పూజా నిర్వహణ శేఖర్ రూ.2,22,000కు, కొబ్బరి చిప్పల సేకరణను గోపాలకృష్ణారెడ్డి రూ.21,000కు, లడ్డు(ప్రసాదం) అమ్మకాలకు సంబంధించి మోహన్ రూ.4,81,000కు పాట దక్కించుకున్నారు. దీంతో మొత్తం రూ.19.88 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



మెప్మా అధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రమణారెడ్డి

రాయచోటి టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) జిల్లా అధికారిగా కె.రమణారెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు అందాయి. అదేరోజు సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈయన జిల్లాలోని రాజంపేట. మదనపల్లె, రాయచోటి మెప్మా పరిధిలోని సంఘాలను బలో పేతం చేయాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు.

వైభవంగా ఆరాధనోత్సవాలు



దర్గా స్వామిజీ ఆరాధన ఉత్సవాలకు హాజరైన భక్తులు

రామాపురం: మండలంలోని నీలకంట్రావుపేట గ్రామం శ్రీ దర్బారు సాయి నగరంలోని శ్రీ దర్గా స్వామిజీ మాతాజీ ఆరాధనోత్సవాలు వైభవంగా నిర్వహించారు. బెంగళూరుకు చెందిన వేద పండితులు స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. రెండురోజులుగా జరగుతున్న ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2024లో నీట్‌లో ఎక్కువ మార్కులతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు శ్రీ దర్గా స్వామిజీ ట్రస్టు నుంచి విద్యార్థికి రూ10వేల చొప్పున చెక్కును అందజేశారు. రాయచోటికి చెందిన చిన్న పిల్లల వైద్య నిపుణులు బయారెడ్డి ఉత్సవాలకు హాజరయ్యారు.

సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్, మంత్రి చేతుల మీదుగా మెమెంటో అందుకుంటున్న విద్యార్థులు

రాయచోటి/కలకడ: సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో అన్నమయ్య జిల్లా, కలకడ మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారని జిల్లాసైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈనెల 20 నుంచి 25వ తేదీ వరకు పుదుచ్చేరిలోని ఓల్డ్ ఫోర్ట్ గ్రౌండ్‌లో నిర్వహించిన సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో మహమ్మద్ సుహేల్, రెహాన్‌లు గ్రూపు విభాగంలో ప్రథమ స్థానం పొందారని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో దక్షిణ భారతదేశానికి చెందిన 8 రాష్ట్రాల నుండి 270 ప్రాజెక్టులను ప్రదర్శించినట్లు చెప్పారు. సుహేల్, రెహాన్‌లు ప్రదర్శించిన బయో ఎంజైన్స్ ప్రాజెక్టు గ్రూపు విభాగం నుంచి మొదటిస్థానంలో నిలిచిందన్నారు. పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ సెల్వం, విద్యాశాఖ మంత్రి నమశ్శివాయం చేతులమీదుగా రూ. 2 వేల నగదు, మెమెంటో, ప్రశంసాపత్రాలు వీరు అందుకున్నారన్నారు. వీరికి గైడ్ టీచర్‌గా సుమతి వ్యవహరించారు. విద్యార్థులు, గైడ్ టీచర్‌ను డీఈఓ సుబ్రమణ్యం, ఉప విద్యాశాఖాధికారి శివప్రకాష్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్ రెడ్డి, ప్రిన్సిపాల్ మలామ్‌షా వలిలు అభినందించారు.

పురుషోత్తమా.. బుద్ధి ప్రసాదించుమా!

'పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా'.. అని అన్నమయ్య శ్రీ వేంకటేశ్వర స్వామిపై ఆలపించిన కీర్తన బహుళ ప్రాచుర్యం పొందింది.

'పొడగంటిమయ్య మిమ్ము పురుషోత్తమా' అంటే నీ రూపాన్ని కాంచితిమి ప్రభూ.. అని అర్థం. అన్నమాచార్య జన్మస్థలి తాళ్లపాకలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీ వేంకటనాథుని ఆలయాన్ని సుందర మనోహరంగా నిర్మించింది. అక్కడ స్వామి వారు కొలువుతారనే సంతోషంతో భక్తులు ఎంతో పరవశించారు. అయితే కూటమి ప్రభుత్వం విగ్రహ ప్రతిష్ట, ఆలయ ప్రారంభంపై నిర్లక్ష్యం వహిస్తోంది.

చెడనీక బ్రతికించే సిద్ధమంత్రమా' అంటే తప్పుదారి పట్టిపోయే మానవులను సరైన మార్గంలో నడిపించి బతుకుదారి చూపించే సిద్ధిమంత్రము ఆ స్వామి అని అర్థం. కూటమి పాలకులు, టీడీపీ పాలక మండలి.. తాళ్లపాక ఆలయంపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారికి బుద్ధి ప్రసాదించి ఆలయం ప్రారంభానికి నోచుకునేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.





తాళ్లపాకలో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం

- అన్నమయ్య జన్మస్థలిలో శ్రీవారి ఆలయం
- వైఎస్సార్‌సీపీ పాలనలో నిర్మాణం పూర్తి
- ప్రారంభంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం
- పట్టించుకోని టీటీడీ పాలకమండలి
- మండిపడుతున్న భక్తజనం

రాజంపేట: 'అదివో.. అల్లదివో.. శ్రీహరివాసము.. బ్రహ్మకడిగిన పాదము'.. అంటూ సులువైన పదాలతో కీర్తనలు ఆలపించిన వాగ్గేయకారుడు అన్నమయ్య జన్మస్థలిలో.. పర్యాటకులు, యాత్రికులు శ్రీవారి (శ్రీ వెంకటేశ్వరస్వామి) దర్శనం కోసం ఎదురుచూస్తున్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ఇక్కడ అభివృద్ధి దిశగా టీటీడీ పాలకమండలి అడుగులు వేసింది. కూటమి పాలనలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఆలయ ప్రారంభం గురించి కూడా పట్టించుకోవడం లేదు. ఈ మార్గంలో నిత్యం టీటీడీ ఉన్నతాధికారులు రాకపోకలు సాగిస్తున్నా.. చూస్తుపోవడమే తప్ప శ్రీవారి ఆలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలన్న ఆలోచన చేయక పోవడం విచారకరమని భక్తులు పెదవి విరిస్తున్నారు. ఇటీవల జరిగిన సంఘటనలతో పాలకమండలిపై భక్తుల నమ్మకం పూర్తిగా సన్నగిల్లింది.

దశాబ్దంన్నర తర్వాత..

అన్నమయ్య ఉద్యానవనంలో దశాబ్దంన్నర తర్వాత (14 ఏళ్లు) మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఎంపిక చేసిన స్థలంలో శ్రీవారి ఆలయం నిర్మించారు. టీటీడీ రూ.కోటికి పైగా వ్యయం చేస్తోంది. ఈ మార్గంలో తిరుమలకు వెళ్లే దక్షిణ భారత యాత్రికులకు ముందుగానే అన్నమయ్య జన్మస్థలిలో శ్రీవారిని దర్శించుకోవడం మహానందగా భావిస్తున్నారు. తాళ్లపాక, 108 అడుగుల విగ్రహం ప్రాంతం పార్కును టీటీడీ ఆటవీశాఖ సిద్ధం చేసింది. ఆలయ నిర్మాణం పూర్తి కావడంతో త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు చేశారు. తర్వాత కూటమి సర్కారు రావడం, టీటీడీ కొత్తపాలకమండలి కొలువు తీరడం తదితర పరిణామాలు జరిగాయి. ఇప్పుడు తాళ్లపాక అన్నమాచార్యుల జన్మస్థలిలోని శ్రీవారి ఆలయం, థీం పార్కు వైపు కూడా కూటమి కన్నెత్తి చూడటం లేదన్న అపవాదును మూటకట్టుకుంది.

600 జయంత్యుత్సవాల నుంచి..

అన్నమాచార్యుని 600 జయంత్యుత్సవాలు అప్పటి పాలకమండలి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో ఘనంగా జరిగాయి. 108 అడుగుల అన్నమయ్య విగ్రహావిష్కరణకు విచ్చేసిన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ ప్రాంత అభివృద్ధికి హామీలు ప్రకటించారు. ఆయన మరణం తర్వాత కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాలు అన్నమయ్య జన్మస్థలి గురించి మరిచిపోయాయి. అప్పటి టీటీడీ పాలకమండలి తాళ్లపాక, అన్నమయ్య థీంపార్కు అభివృద్ధికి సంబంధించి నిధుల కేటాయింపు చేయలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అప్పటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి సారించారు. అప్పట్లో జెడ్పీచైర్మన్‌గా ఉన్న స్థానిక ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కృషి ఫలితంగా వైవీ సుబ్బారెడ్డి అన్నమయ్య థీంపార్కును సందర్శించారు. గత సార్వత్రిక ఎన్నికల ముందు అప్పటి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి హయాంలో మళ్లీ అన్నమయ్య జన్మస్థలి అభివృద్ధిపై దృష్టి సారించారు.



విగ్రహ ప్రతిష్ట చేయాలి

గత ప్రభుత్వ పాలనలో అన్నమయ్య థీంపార్కులో టీటీడీ శ్రీవారి ఆలయ నిర్మితం చేసింది. అయితే ఇప్పటి టీటీడీ అధికారులు అందులో శ్రీవారి విగ్రహ ప్రతిష్ట చేయడం మరిచారు. ఇప్పటికైనా వారు విగ్రహ ప్రతిష్ట చేసి, ఆలయాన్ని ప్రారంభించాలి.



–ఎస్. గౌరీశంకర్, సర్పంచ్, తాళ్లపాక, రాజంపేట

టీటీడీ బోర్డు స్పందించాలి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 108 అడుగుల అన్నమయ్య విగ్రహ ప్రాంతంలో శ్రీవారి ఆలయం నిర్మితం చేశారు. కూటమి ప్రభుత్వం ఇంత వరకు ఆలయాన్ని భక్తులకు అందుబాటులో తీసుకురాలేక పోయింది. ఇప్పటికైనా టీటీడీ బోర్డు స్పందించి ఆలయాన్ని ప్రారంభించాలి.



–పి.విశ్వనాథరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకం



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీధర్

జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఛామకూరి

రాయచోటి: ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఓటుహక్కే కీలకమని, ఓటు వేయడం పౌరుల హక్కు మాత్రమే కాదు బాధ్యత కూడా అని జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా రాయచోటిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి కలెక్టర్ బంగ్లా వరకు జరిగిన ఓటర్ల దినోత్సవ ర్యాలీలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఓటుహక్కుకు సమానమైనది ఏదీలేదని.. నేను కచ్చితంగా ఓటు వేస్తాను అనే థీమాతో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న పౌరులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

వయోజనులంతా ఓటు హక్కు కలిగి ఉండాలి

పీలేరు: వయోజనులంతా ఓటు హక్కు కలిగి ఉండాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోజకవర్గపు ఎన్నికల అధికారి రమా అన్నారు. శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశ భవిష్యత్తును, మన భవిష్యత్తును ఉన్నతంగా మలచుకోవడానికి ఓటుహక్కు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ భీమేశ్వర్ రావు, ఏఎస్‌వో రామ్మోహన్, డీటీ సుబ్రమణ్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



గణతంత్ర వేడుకలకు ముస్తాబైన పోలీస్ పరేడ్ మైదానం



విద్యుత్ దీపాలంకరణలో కలెక్టర్ కార్యాలయం

- ముస్తాబైన పోలీస్ పరేడ్ మైదానం, కలెక్టరేట్

రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలో ఆదివారం నిర్వహించే 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు సర్వ సిద్ధం చేశారు. పోలీస్ పరేడ్ మైదానాన్ని శనివారం ముస్తాబు చేశారు. ఆదివారం రాయచోటిలోని పోలీస్ పెరేడ్ మైదానంలో వేడుకలు ప్రారంభం అవుతాయని జిల్లా కలెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8.50 గంటలకు జాతీయ పతాకం ఆవిష్కరణ అనంతరం పోలీసుల కవాతు(మార్చ్ ఫాస్ట్) ఉంటుందన్నారు. ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల సందేశం, పోలీసు జాగిలాల విన్యాసాలు, జిల్లా ప్రగతిని చాటే శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని కూడా రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరణ చేశారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కలెక్టర్ కోరారు.

కమ్మేసిన పొగమంచు



ఒంటిమిట్ట రామాలయాన్ని శనివారం పొగ మంచు దుప్పటిలా కమ్మేసింది. గత మూడు రోజులుగా ఆలయం పరిసరాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. కొందరు పొగ మంచులో దాక్కున్న ఆలయ ఫొటోలు తీస్తూ సోషల్‌మీడియాలో పెడుతున్నారు.

–ఒంటిమిట్ట

డీటీసీ లైంగిక వేధింపులపై విచారణ కమిటీ

- జేటీసీ నివేదికను తప్పు పట్టిన జిల్లా కలెక్టర్
- డీటీసీపై విచారణకు ఐదుగురు మహిళా అధికారుల కమిటీ
- రాజీ చేసేందుకు ఇతర జిల్లాల అధికారుల ప్రయత్నాలు



జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, కడప : మహిళా ఉద్యోగిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వైఎస్సార్ జిల్లా ఉప రవాణా అధికారి చంద్రశేఖర్‌రెడ్డిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వ పెద్దలు వెనకడుగు వేస్తున్నారా? ఈక్రమంలోనే రాజీ ప్రయత్నాలు ఆరంభించారా! అంటే విశ్లేషకులు అవును అనే సమాధానమిస్తున్నారు. మహిళా ఉద్యోగి ఇంటికి వెళ్లి తలుపు తట్టే స్థాయికి చేరిన డీటీసీకి రక్షణగా రాష్ట్ర స్థాయి అధికారి అండదండలుగా నిలుస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ప్రాథమిక నివేదిక తప్పుదారి పట్టినట్లు తెలుస్తోంది. వెరసి జిల్లా స్థాయి విచారణ కమిటీ తెర్మపైకి వచ్చినట్లు సమాచారం.

ఇంటర్నల్ కమిటీ ఏర్పాటు



డీటీసీ చంద్రశేఖర్ రెడ్డిపై వచ్చిన ఆరోపణలపై విచారణాధికారిగా జేటీసీ కృష్ణవేణిని నియమించారు. బాధిత ఉద్యోగి, ఆమె భర్త నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసి నివేదిక శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, రవాణాశాఖ కమిషనర్‌కు అందించినట్లు సమాచారం. జేటీసీ నివేదికను పరిశీలించిన కలెక్టర్ అసహనం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆపై ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి కన్వీనర్‌గా ముగ్గురు సీనియర్ మహిళాధికారులు, ఒకరు ఎన్జీఓతో కూడిన ఇంటర్నల్ కమిటీ నియమించినట్లు సమాచారం. వాస్తవాలను పరిశీలించి మూడు రోజులల్లో నివేదిక అందించాలని ఆదేశించారు. బాధిత మహిళా ఉద్యోగి సైతం ఫిర్యాదుకు వెనుకంజ వేయడం కూడా ఇక్కడ ప్రశ్నార్థకంగా మారింది. మరో మహిళా ఉద్యోగికి ఉన్నతాధికారి ద్వారా లైంగిక వేధింపులు లేకుండా ఉండాలంటే చట్టాన్ని ఆశ్రయించాలనే డిమాండ్ మహిళాలోకం నుంచి వ్యక్తమవుతోంది.

ఇన్‌చార్జ్ డీటీసీగా ప్రసాద్

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లా ఉప రవాణాశాఖ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా ప్రసాద్‌ను నియమించారు. ఈయన అన్నమయ్య జిల్లాలో డీటీఓగా పని చేస్తున్నారు. ఇక్కడ డీటీసీగా పని చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి మహిళా ఉద్యోగిపై లైగింక వేధింపులకు పాల్పడటంతో.. ఆయనను రవాణా శాఖ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు.

వివాదాస్పద అధికారిగా పేరు



డీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి

ఓ మహిళా ఉద్యోగి ఇంటికి వెళ్లి డీటీసీ చంద్రశేఖరరెడ్డి తలుపు తట్టారు. గమనించిన ఆమె తన భర్తకు ఫోన్ ద్వారా విషయం తెలియజేయడం, ఆయన డీటీసీకి ఫోన్ చేయడంతో అక్కడి నుంచి చంద్రశేఖరరెడ్డి జారుకున్నారు. ఆ తర్వాత సదరు మహిళా ఉద్యోగి భర్త రవాణా శాఖ కార్యాలయానికి వచ్చి డీటీసీ దూషించడంతోపాటు చితక బాదేందుందుకు ప్రయత్నించారు. తోటి ఉద్యోగులు అడ్డుకొని సర్దుబాటు చేయగా, డీటీసీ కాళ్ల బేరానికి వచ్చినట్లు సమాచారం. ఈ దృశ్యాలన్నీ సీసీ కెమెరాల్లో నిక్షేపితమై ఉన్నాయి. రెండు నెలల కిందట కడపలో బాధ్యతలు చేపట్టిన డీటీసీ చంద్రశేఖర్ రెడ్డి అనతికాలంలోనే వివాదాస్పద అధికారిగా మారారు. రెండు నెలల కాలంలోనే మహిళా ఉద్యోగినులను వేధించడం పరిపాటిగా మారింది. ఈయన పని చేసిన గుంటూరు, శ్రీకాకుళం, బాపట్ల, కావలి, నెల్లూరు జిల్లాల్లో ఇదే తీరులో మహిళా ఉద్యోగుల పట్ల లైంగికంగా వేధించిన ఆరోపణలున్నాయి. అయినా కూడా సత్వర చర్యలు చేపట్టేందుకు ఆశాఖలో కీలక అధికారి వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర స్థాయి అధికారి అండదండలు

డీటీసీ చంద్రశేఖరరెడ్డికి అండగా రవాణాశాఖలో పెద్ద ఎత్తున రాజీ ప్రయత్నాలు ఆరంభమైనట్లు సమాచారం. ఆ శాఖలో కీలకంగా ఉన్న రాష్ట్ర స్థాయి అధికారి సైతం ఈ వ్యవహారంలో అండగా నిలుస్తోన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర స్థాయి అధికారి అండదండలు ఉండటంతోనే ప్రాథమిక నివేదిక అస్తవ్యస్తంగా వెళ్లినట్లు తెలుస్తోంది. నిద్రలో నడిచే అలవాటు ఉన్న కారణంగానే డీటీసీ చంద్రశేఖరరెడ్డి.. ఆ ఇంటికి వెళ్లినట్లు నివేదికలో పొందు పర్చడం వివాదస్పదంగా మారినట్లు సమాచారం. జిల్లా మహిళాధికారుల నేతృత్వంలో ఫైవ్ ఉమెన్ కమిటీలో వాస్తవాలు నిగ్గుతేలాల్సిన అవసరం ఉంది. ఆ మేరకే కలెక్టర్ తదుపరి చర్యలకు సిఫార్సు సిద్ధం కానున్నట్లు సమాచారం.

క్లుప్తంగా

పోలి చెరువుకట్టపై ఆటో, బైకు ఢీ

రాజంపేట : రాజంపేట–నెల్లూరు రహదారిలోని పోలిచెరువుకట్ట (రాజంపేట)పై శనివారం ఆటో, బైకు ఢీ కొన్నాయి. పోలి గ్రామం నుంచి మదనపల్లె చంద్రశేఖర్ బైకులో వస్తున్న క్రమంలో ఆటోను ఢీ కొన్నారు. బైక్ నడుపుతున్న క్షతగాత్రునికి తీవ్రగాయాలయ్యాయి. ఆటోలు ఉన్న డ్రైవరుతో సహా ముగ్గురికి గాయాలు అయ్యాయి. వీరిని 108లో రాజంపేట ప్రాంతీయ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. మన్నూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి యువతిపై దాడి

గుర్రంకొండ : ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ యువతిపై దాడి చేసిన సంఘటన మండలకేంద్రమైన గుర్రంకొండలో చోటుచేసుకుంది. స్థానిక ఇందిరమ్మ కాలనీలో నాగరాజ అనే వ్యక్తి తాపీ మేస్త్రీ పనిచేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని కుటుంబానికి పక్కనే ఉన్న శ్యామలమ్మ కుటుంబానికి ఇంటి స్థలం విషయమై గతంలో వివాదాలు జరిగాయి. ఈనేపథ్యంలో గత శుక్రవారం నాగరాజ కుమార్తె బి. శ్రీలేఖ(20) ఇంట్లో ఒంటరిగా ఉండగా పాత కక్షలు మనసులో ఉంచుకొని శ్యామలమ్మ అతని కుటుంబ సభ్యులు శ్రీలేఖపై దాడికి పాల్పడ్డారు. విషయం తెలుసుకొన్న కటుంబసభ్యులు హుటాహుటిన బాధితురాలిని మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. జరిగిన సంఘటనపై బాధితురాలి తండ్రి నాగరాజ స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆరు గొర్రెలు అనుమానాస్పద మృతి

రామసముద్రం : మండలంలోని చొక్కాండ్లపల్లి పంచాయతీ పురాండ్లపల్లి గ్రామంలో అనుమానాస్పదంగా ఆరు గొర్రెలు శనివారం మృతి చెందాయి. వివరాలిలా.. పురాండ్లపల్లి గ్రామానికి చెందిన రైతు రత్నప్ప భార్య సరోజమ్మలకు 60 గొర్రెలు ఉన్నాయి. వాటిని మేపేందుకు గ్రామ పొలిమేరలకు వెళ్లారు. సాయంత్రం సమీపంలోని మొక్కజొన్న తోటలో గొర్రెలు మేస్తుండగా రెండు గొర్రెలు అనుమానాస్పదంగా అక్కడికక్కడే మృతి చెందాయి. గమనించిన రైతు వెంటనే స్థానిక పశువైద్య సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన సచివాలయ వెటర్నరీ సిబ్బంది మణి, యుగంధర్, అటెండర్ రెడ్డప్ప తదితరులు అక్కడికి చేరుకొని గొర్రెలను పరిశీలించి చికిత్స చేసి టీకాలు వేశారు. చికిత్స చేస్తుండగా మరో నాలుగు గొర్రెలు అక్కడే విలవిలలాడుతూ మృతి చెందాయి. రైతు కుటుంబం లబోదిబోమంటూ విలపించారు. మొక్కజొన్న తోటలో గడ్డి నివారణ మందులు ఏమైనా పిచికారి చేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కోతకు గురైన భూముల పరిశీలన

సిద్దవటం : మండలంలోని కడపాయపల్లె, లింగంపల్లె, టక్కోలు గ్రామాలలోని రైతుల భూములు పెన్నానది వరద నీటికి కోతకు గురయ్యాయి. ఆ భూములను శనివారం ఇరిగేషన్ ఏఇ సాయికృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టక్కోలు గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి గత ఏడాది డిశంబర్ 31వ తేదీన తమ విలువైన భూములు పెన్నానది వరద నీరు కోతకు గురవుతున్నాయని స్పందనలో ఫిర్యాదు చేసిందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోతకు గురైన భూములను పరిశీలించామన్నారు. పెన్నానదిలో నీరు ఎక్కువగా ప్రవహిస్తుందని, నీరు తగ్గిన వెంటనే కోతకు గురైన పంట పొలాలను సర్వే నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఆయన అన్నారు.

నువ్వా.. నేనా..!

- పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్సీ మధ్య వర్గ విభేదాలు
- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న మాజీ ఎమ్మెల్సీ వర్గీయులు
- ఇటీవల రేషన్ డీలర్ల విషయంలోనూ దౌర్జన్యం చేసిన మాజీ ఎమ్మెల్సీ వర్గీయులు
- అధిష్టాన వర్గానికి ఇరువురు నేతల ఫిర్యాదు



సాక్షి టాస్క్‌ఫోర్స్ : పులివెందుల అంటేనే వైఎస్ కుటుంబానికి కంచుకోట. అలాంటి కంచుకోటలో పాగా వేయాలని టీడీపీ రాష్ట్ర నేతలు విఫల ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఇక్కడ పరిస్థితి మరో విధంగా ఉంది. పులివెందుల టీడీపీ నేతల మధ్య వర్గ పోరు తారాస్థాయికి చేరుకుంది. పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ప్రస్తుత ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి వర్గాలు 'నువ్వా, నేనా' అన్నట్లు తీవ్ర విభేదాలతో ప్రవర్తిస్తున్నారు. వివరాలలోకి వెళితే పులివెందుల నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి యథేచ్ఛగా మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అనుచరులు పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ప్రతి మండలంలోనూ తామే అంతా అన్నట్లుగా వ్యవహరిస్తూ పోలీసు, ఇతర అధికారులను విస్మరిస్తూ యథేచ్ఛగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. ఉదాహరణకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండు రోజుల్లోపే పులివెందులలో ఉన్న దాదాపు కోటి రూపాయల ఇసుక రీచ్‌ను బీటెక్ రవి అనుచరులు తరలించుకెళ్లడం జరిగింది. అంతేకాక ఇటీవల సంక్రాంతి పండుగ నేపథ్యంలో వేముల మండలంలోని దాదాపు రూ.15కోట్లు విలువ చేసే ముగ్గురాయిని రాత్రికి రాత్రే తరలించారు. అంతేకాక సంక్రాంతి పండుగ నేపథ్యంలో యథేచ్ఛగా ప్రతి మండలంలోనూ కోడి పందేలు, గ్యాంబ్లింగ్, గుండాట తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించి లక్షలు సొమ్ము చేసుకున్నారని విమర్శలు ఉన్నాయి.

యథేచ్ఛగా గ్యాంబ్లింగ్

పులివెందుల నియోజకవర్గంలో యథేచ్ఛగా గ్యాంబ్లింగ్ జరుగుతోందని జగమెరిగిన సత్యం. నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకులు గ్యాంబ్లింగ్ నిర్వహిస్తున్నారు. ఇటీవల వారి మధ్య విభేదాలు వచ్చి ఆ పంచాయతీ కూడా నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి వద్దకు చేరినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ, ప్రస్తుత ఎమ్మెల్సీల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరిన నేపథ్యంలో ప్రస్తుత ఎమ్మెల్సీ పోలీసులపై గ్యాంబ్లింగ్ నిర్వహించకూడదని తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. గ్యాంబ్లింగ్ విషయంలో డివిజన్ పోలీసు అధికారి, రూరల్ అధికారి నిరంతరం మామూళ్ల మత్తులో జోగుతున్నట్లు సమాచారం. వీరికి గ్యాంబ్లింగ్ ద్వారా ప్రతి నిత్యం మామూళ్లు అందుతున్నట్లు టీడీపీ కార్యకర్తలే చెబుతున్నారు. అయితే డివిజన్ పోలీసు అధికారి రూరల్ అధికారిలపై పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. కేవలం గ్యాంబ్లింగ్ ద్వారా వచ్చే ఆదాయాన్ని వీరిరువురే పంచుకోవడంపట్ల మిగతా డిపార్ట్‌మెంట్ ఎస్‌ఐ, సీఐలు కానీ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

పలు ప్రాంతాలలో జూదం

పులివెందుల నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో మంగతాయి జూదం యథేచ్ఛగా సాగుతోంది. లింగాల మండలంలోని ఇప్పట్ల స్థోత్రీయం గుట్టలో మంగతాయి జూదం జరుగుతోంది. దీనికి ఆ మండల ఇన్‌ఛార్జి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు సమాచారం. జూదం నిర్వహించేవారు కూడా మండల ఇన్‌చార్జి అనుచరులే కావడం గమనార్హం. ఇంతా జరుగుతున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. అలాగే పులివెందుల పట్టణ పరిధిలోని కదిరి రోడ్డు, జెఎన్‌టీయూ వెనుక వైపు ఉన్న గుట్టలోనూ, తుమ్మలపల్లె గుట్టలోనూ, పెద్దరంగాపురం గుట్టలోనూ యథేచ్ఛగా జూదం జరుగుతోంది. అయితే పోలీసులు అటువైపు కన్నెత్తి కూడా చూడటంలేదు. దీనికి ప్రధాన కారణం వారికి రోజు వచ్చే మామూళ్లేనని సమాచారం. ఇటీవల టీడీపీ ద్వితీయ శ్రేణి నాయకుడు జూదంపై ప్రెస్‌మీట్ కూడా ఇవ్వడం జరిగింది. అయితే ఆ నాయకుడు చెప్పినట్లుగా జూదం అరికట్టడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారని చెప్పవచ్చు.

హంద్రీనీవాకు సమాంతర కాలువ ప్రారంభించాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య



సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మదనపల్లె : హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పదివేల క్యూసెక్కులకు పెంచి, కాలువ విస్తరణ పనులు తక్షణమే ప్రారంభించి సమాంతర కాలువ ప్రారంభించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య కోరారు. సీపీఐ ఆధ్వర్యంలో శనివారం సబ్ కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ కరువు పీడిత ప్రాంతమైన రాయలసీమ జిల్లాల్లో పంటపొలాలకు నికరసాగు జలాలు తీసుకురావాలన్నారు. వ్యవసాయం సజీవంగా బ్రతకాలంటే కనీసం 30 శాతం వ్యవసాయ భూమికి సాగునీరు అందించాలని అన్నారు. హంద్రీనీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80,000; అనంతపురం జిల్లాలో రెండు దశల కింద 3,45,000, కడప జిల్లాలో 37,500; చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి వుంది. అయితే ప్రస్తుత కాలువ సామర్థ్యం అందుకు అనుగుణంగాలేదన్నారు. గత ప్రభుత్వం హంద్రీనీవా కాలువ వెడల్పుకు,పంట కాలువల నిర్మాణానికి నిధులు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తపరుస్తూ కూటమి ప్రభుత్వాన్ని భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. రానున్న బడ్జెట్ లో హంద్రీనీవా కాలువ వెడల్పును పదివేల క్యూసెక్కులకు పెంచేందుకు, ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చేందుకు అవసరమైన పంటకాల్వల నిర్మాణానికి నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివారెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కృష్ణప్ప, సాంబ శివ, నియోజకవర్గ కార్యదర్శి కె మురళి కార్యవర్గ సభ్యులు తిరుమల, మాధవ్,సూరి,రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ స్పెషల్ ఆఫీసర్ తొలగింపు

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లాశాఖ స్పెషల్ ఆఫీసర్‌ను తొలగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ద్వారా శనివారం ఆదేశాలు వచ్చాయి. ఫలితంగా ఆయన స్థానంలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడు నూతన స్పెషల్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. కార్యదర్శిగా జిల్లా ఉపాధికారి సురేష్‌కుమార్‌ను నియమించారు. విద్యాశాఖ పూర్వ ఉన్నతాధికారి అలపర్తి పిచ్చయ్యచౌదరి చైర్మన్‌గా పూర్తి కాలం సేవలు అందించిన తర్వాత ఆ పోస్టుకు ఎన్నికలు నిర్వహించారు. చైర్మన్ పోస్టుకు అభ్యర్థులు పోటాపోటీగా నిలువగా సభ్యుల నియామకంలో పలు అక్రమాలు చోటుచేసుకున్నట్లు తెలిసి కొందరు వ్యక్తులు కోర్టుకు వెళ్లారు. ఆ సమస్య ఇంతవరకు పరిష్కారం కాలేదు. అనంతరం 2023 ఆగస్టు 23న శివశంకర్‌రెడ్డిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. రాష్ట్ర మంతటా రెడ్‌క్రాస్ సంస్థలో ప్రస్తుతం ఉన్న స్పెషల్ ఆఫీసర్లను తొలగించి తమకు కావాల్సిన వారిని నియమించుకునేందుకు ప్రస్తుత ప్రభుత్వం పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. కొన్నిచోట్ల నియామకాలు కోర్టులో ఉండగా, వాటిని పూర్తిగా రద్దు చేసి మరీ తమ వారిని తెచ్చుకునేందుకు ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం.

కూటమి నాయకుల కబ్జాలను అడ్డుకోండి

– సీపీఐ నాయకుల డిమాండ్

ఓబులవారిపల్లె : కొర్లకుంట గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పక్కనే చెరువు పోరంబోకుకు ఆర్‌అండ్‌బీకి సంబంధించిన ప్రభుత్వ భూమిలో కూటమి నాయకులు యథేచ్ఛగా కబ్జాలు చేసి ఇంటి నిర్మాణాలు పూర్తి చేస్తున్నారని సీపీఐ రైల్వేకోడూరు నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య ఆరోపించారు. శనివారం ఈ విషయంపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జ్యోతి చిన్నయ్య మాట్లాడుతూ విలువైన చెరువు పోరంబోకు భూమిలో ఇటివలే గ్రామస్తుడు మనోహర్ బేస్‌మట్టం కోసం పునాదులు తీయగా అతనిని అడ్డుకున్నారు. అయితే అదే స్థలం పక్కనే కూటమి నాయకులు కట్టడాలు కట్టి పూర్తిచేసి కబ్జాలకు పాల్పడుతున్నారు. రెవెన్యూ అధికారులకు ఇది కనిపించదా అని ఆయన ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని లేనిపక్షంలో సీపీఐ తరపున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యం



తమ్మిశెట్టి శ్రీధర్ (ఫైల్)

వేంపల్లె : స్థానిక శ్రీరాం నగర్ వీధికి చెందిన తమ్మిశెట్టి శ్రీధర్ (15) అనే విద్యార్థి అదృశ్యమయ్యాడని వేంపల్లె ఎస్ఐ రంగారావు తెలిపారు. ఈ మేరకు వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైంది. విద్యార్థి తండ్రి వెంకటేష్ తెలిపిన వివరాలు మేరకు.. ఈ నెల 18వ తేదీన రాత్రి 8 గంటలకు కాలేజీకి చక్రాయపేటకు వెళ్లుతున్నానని చెప్పి ఇంటి నుండి శ్రీధర్ వెళ్లిపోయాడన్నారు. రెండు రోజుల తర్వాత విద్యార్థి తండ్రి తమ్మిశెట్టి వెంకటేష్‌కు కళాశాల నుండి మీ అబ్బాయి కాలేజీకి రాలేదని సమాచారం వచ్చిందన్నారు. చుట్టు పక్కల గ్రామాలకు, బంధువుల ఇళ్లకు వెళ్లి వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం విద్యార్థి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు

మైనర్ బాలికపై అసభ్య ప్రవర్తన

రాయచోటి : రాయచోటిలో 13 ఏళ్ల మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన 50 సంవత్సరాల వ్యక్తిపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. రాయచోటి పట్టణం, మాసాపేటలో నివాసం ఉంటున్న శివయ్యకు 13 సంవత్సరాల మానసిక (మూగ) దివ్యాంగురాలైన బాలిక ఉంది. ఈ బాలికపట్ల మాసాపేటకు చెందిన కాయల శంకరయ్య (50) అసభ్యంగా ప్రవర్తించి హింసించినట్లు బాలిక తల్లి శనివారం రాత్రి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు శంకరయ్యపై ఫోక్సో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కల్నల్ సీకే నాయుడు క్రికెట్ టోర్నీ ప్రారంభం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజా రెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో కల్నల్ సీకే నా యుడు అంతర్ రాష్ట్రాల క్రికెట్ టోర్నమెంట్ ప్రా రంభమైంది. ఇందులో భాగంగా శనివారం ఆంధ్ర, పంజాబ్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పంజాబ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొ లుత బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 83 ఓవర్ల లో 211 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టు లోని జి.ఎస్.పి. తేజ 157 బంతుల్లో 8 ఫోర్లతో 70 పరుగులు చేశాడు. ఈయనకు జతగా ఎస్. డి. ఎన్.వి. ప్రసాద్ 27, రేవంత్‌రెడ్డి 23 పరుగులు చే శారు. అలాగే పంజాంబ్ బౌలర్లు క్రిష్ భగత్ 4 వికె ట్లు, ఆర్యమన్ దలీవాల్ 2, అభయ్ చౌదరి 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని కలమల్ల– ముద్దనూరు రైల్వే స్టేషన్‌ల మధ్యలోని సున్నపురాళ్లపల్లె గ్రామ సమీపంలో రైల్వే ట్రాక్‌పై అదే గ్రామానికి చెందిన చిన్నిగాళ్ల బుజ్జి (49) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ సునీల్‌కుమార్‌రెడ్డి శనివారం తెలిపారు. మృతురాలికి మానసిక స్థితి సరిగా లేకపోవడంతో గూడ్సు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుందని తెలిపారు. మృతురాలికి భర్త యేసయ్యతో పాటు ముగ్గురు సంతానం ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు

మానవ హక్కులను తెలుసుకోవాలి

– జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురప్ప

కడప రూరల్ : మానవ హక్కుల రక్షణ చట్టాలను గురించి తెలుసుకోవాలని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుర్రప్ప తెలిపారు. నగరంలోని ప్రెస్ క్లబ్‌లో జిల్లా అధ్యక్షుడు సయ్యద్ షాబుద్దీన్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశ మందిరంలో శనివారం షా సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా, నగర కమిటీలను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా సయ్యద్ షాబుద్దీన్ మరియు నగర అధ్యక్షులుగా ప్రసన్న కుమార్‌ని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ నజముద్దీన్, రాష్ట్ర అధ్యక్షులు అలీ షేర్ ఎస్ఎండీ తాహిర్, జిలాని, బాదుల్లా, బషీర్ బుఖారి తాహిరుల ఖాదిరి, మహిళ అధ్యక్షురాలు ఆస్మా, కిరణ్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

దావోస్ పర్యటనలో బాబు గ్రాఫిక్ విన్యాసాలు

- ఒక్క ఎంఓయూ కుదుర్చుకోలేదు
- పర్యటన ఖర్చు తప్ప ఒరిగింది లేదు
- తగుదునమ్మా అంటూ జగన్‌పై ఆరోపణలు
- వైఎస్సార్ సీపీ వైఎస్ఆర్ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి




మాట్లాడుతున్న రవీంద్రనాథ్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జరిపిన దావోస్ పర్యటనలో గ్రాఫిక్ విన్యాసాలు, ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప రాష్ట్రానికి ఒక్క రూపాయి కూడా పెట్టుబడి తీసుకు రాలేకపోయారని వైఎస్సార్ సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి విమర్శించారు. శనివారం కడపలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం దావోస్‌లో ఒక్క ఎంఓయూ కూడా కుదుర్చుకోలేకపోవడం ఆయన అసమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు.వైఎస్సార్ జిల్లా వనిపెంటకు చెందిన సునీల్‌కుమార్ అనే వ్యక్తికి ఒక కోటు తగిలించి పెట్టుబడిదారుడంటూ మంత్రి నారా లోకేష్‌తో ఫోటో తీయించడం ప్రజలను మభ్యపెట్టేందుకేనని ఆరోపించారు. పైగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదని చంద్రబాబు ఆరోపించడం ఆయన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికేనన్నారు. తెలంగాణ, మహారాష్ట్రలకు పెట్టుబడులు వెళుతున్నాయన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దావోస్ పర్యటనకు వెళ్లినపుడు కొన్ని వందల ఎంఓయూలు కుదుర్చుకున్నారని పేర్కొన్నారు. బాబు దావోస్ పర్యటన వల్ల ప్రభుత్వానికి రూ. 80 కోట్లు ఖర్చయిందే తప్ప ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడిచినా సరైన పాలన లేకుండా పోయిందన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, పాకా సురేష్, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

భారతి సిమెంట్స్ సేవలు అభినందనీయం

ఎమ్మెల్యే చైతన్యరెడ్డి



భారతి సిమెంట్స్ చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రణాళిక పత్రాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చైతన్యరెడ్డి

కమలాపురం : మండలంలోని నల్లింగాయపల్లెలో వెలసిన భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీసీపీఎల్) సీఎస్ఆర్ నిధులతో చేస్తున్న సేవలు అభినందనీయం అని ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి కొనియాడారు. బీసీసీపీఎల్ సీఎస్ఆర్ నిధులతో కమలాపురం పట్టణంలోని 9వ వార్డు అంగన్వాడీ అంగన్వాడీ కేంద్రంలో చేపట్టనున్న అభివృద్ధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. చిన్నారులతో మాట్లాడారు. గుడ్లు, చిక్కీలు తదితర పోషకాహారం ఇస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను సొంత పిల్లల్లా చూసుకోవాలని సిబ్బందికి సూచించారు. కాగా భారతి సిమెంట్స్ ఐఆర్‌పీఆర్ చీఫ్ మేనేజర్ భార్గవ్ రెడ్డి అంగన్వాడీ కేంద్రాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనుల ప్రణాళికల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే చైతన్యరెడ్డి మాట్లాడుతూ కమలాపురం పట్టణంలోని ఐదు అంగన్వాడీ కేంద్రాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు భారతి సిమెంట్స్ ముందుకు రావడం అభినందనీయం అన్నారు. అలాగే స్కూల్స్‌లో కూడా టాయిలెట్లు, ల్యాబ్స్ తదితరవి ఏర్పాటు చేయాలని పరిశ్రమ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయ కుమారి, అంగన్వాడీ సిబ్బంది, పెయిడ్ ఎన్‌జీఓ నాగేశ్వర్ రెడ్డి, నగర కమీషనర్ పగడాల జగన్నాథ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.